


ఎ(గి)స్మా జాంతా నై..

- ముందుకే సమ్మె..
- కళ్ళకు గంతలతో అంగన్వాడీల నిరసన


శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తాము స్కీం వర్కర్లమనీ, తమకు ఎస్మా చట్టం వర్తించందని అంగన్వాడీలు అన్నారు. అయినా ప్రభుత్వం తమపై ఎస్మాస్త్రాన్ని ప్రయోగించినా భయపడేది లేదని స్పష్టం చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు, ఐఎఫ్టియు, ఎఐటియుసి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు కళ్ళకు నల్ల గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. హర్యానాలో అంగన్వాడీల 65రోజుల సమ్మె అనంతరం ప్రభుత్వం దిగొచ్చిందనీ, వారి స్ఫూర్తిగా ఏపీలో కూడా అంగన్వాడీలు సమ్మెను ముందుకు తీసుకెళ్తామని అంగన్వాడీ నాయకులు రేవతి చెప్పారు. సీఐటీయూ నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, రాజా, అంగన్వాడి నాయకులు పుష్ప, సౌజన్య, సక్కుబాయమ్మ పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: ప్రభుత్వం ప్రకటించిన ఎస్మాను తక్షణమే ఉపసంహరించుకోవాలని తిరుపతిలోని అంగన్వాడీలు దీక్షా శిబిరం వద్ద జీవో కాపీలను దగ్ధం చేశారు. ఆదివారం అంగన్వాడీల సమ్మె 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ చిరుద్యోగులైన అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపటం దారుణమని, సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ప్రభుత్వం నిర్బంధం చూపిస్తున్నదని విమర్శించారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని పదేపదే విన్నవించినా, పట్టించుకోని ముఖ్యమంత్రి పెరిగిన ధరలతో అంగన్వాడీ సెంటర్లు నడపడం కష్టమైపోతున్న తరుణంలో, జీతం చాలీచాలకుండా, కుటుంబాలను గడపటం కష్టతరమై పోతున్నదని అన్నారు. అంగన్వాడీల కష్టాన్ని చూసి స్పందించి జీతాలు పెంచడం మాని సమ్మెలో ఉన్న అంగన్వాడీలను బలప్రయోగంతో అణచివేయడానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య, ఎ.పద్మజ, డి.నిర్మల అంగన్వాడీలకు మద్దత తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే. వేణుగోపాల్, జి.బాలాజీ, పీ.బుజ్జి, అంగన్వాడీల నాగరాజమ్మ, జయప్రభ, సుజిత,గీత, ఎల్లమ్మ, వెంకటలక్ష్మి, సుశీలమ్మ పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: అంగన్వాడీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న శాంతియుత ఆందోళనను, సమ్మెను అణిచివేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించటాన్ని, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తీవ్రంగా ఖండిస్తున్నదని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.మురళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


గూడూరులో..

వెంకటగిరి: అంగన్వాడీలకు జీతాలు పెంచేంతవరకు సమ్మెను ఆపమని, ఎన్ని జీవోలు తెచ్చిన భయపడే ప్రసక్తే లేదని ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు హెచ్చరించారు. వెంకటగిరిలో అంగన్వాడీలు 27వ రోజూ సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించమని సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చీమకుట్టినట్టు కూడా లేదని, ఎస్మా ప్రయోగిస్తామని జీవోలు తేవడం బెదిరించే ప్రయత్నాన్ని మానుకోవాలని అన్నారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, మంజుల కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయుడుపేట: స్థానిక ఐసిడిఎస్ వద్ద అంగన్వాడీలు 27వ రోజు సమ్మెను కొనసాగించారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు శివకవి, ముకుంద అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.శ్యామలమ్మ, నాగమ్మ, వాణి, చెంగమ్మ, సంధ్య పాల్గొన్నారు..


తిరుపతిలో..

పిచ్చాటూరు: రాష్ట్ర ప్రభుత్వం గత 27రోజులుగా అంగన్వాడీలు న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు చేస్తున్న సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం లాంటి ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి దాసరి జనార్ధన్ ధ్వజమెత్తారు. ఆదివారం పిచ్చాటూరు ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద నిరసన కొనసాగించారు. నాయకులు ఇంద్రాణి, రాజేశ్వరి, కృష్ణవేణి, గ్లోరి, పూర్ణమ్మ, భారతి, విజయలక్ష్మి, సావిత్రి, నాగభూషణమ్మ, ప్రమీల, శ్రీదేవి, శివశంకరి, సఫియా పాల్గొన్నారు.

గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరవధిక సమ్మె 26వ రోజు చేరుకుంది. ఆగ్రహంతో ఎస్మా ఉత్తర్వులను అంగన్వాడీలు తగలబెట్టారు. గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు ఏ.ఇంద్రావతి సిఐటియు పట్టణాధ్యక్షులు బివి.రమణయ్య, కార్యదర్శి ఎస్.సురేష్ ఏ.ప్రసాద్ బి.చంద్రయ్య, గుర్రం రమణయ్య పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: ఎస్మా జీవోను రద్దు చేయాలని పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట 27వ రోజు అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఏస్మా జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కళ్లకు గంతలు కట్టుకుని జీవో ప్రతులను దగ్ధం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంగన్వాడీలు విజయ కుమారి, ధనమ్మ, రాధా, పద్మజ, మోహన్ లక్ష్మి, లలిత, అన్నపూర్ణ, గంగులమ్మ, కృష్ణవేణి, ప్రమీల పాల్గొన్నారు.

రేణిగుంట: అంగన్వాడీ సమ్మెను అత్యవసర సేవలకు భంగం కలుగుతున్నందున ప్రభుత్వం ఎస్మా జీవో నెం.2ను ప్రయోగిస్తున్నామని చెప్పడం సిగ్గుచేటని రేణిగుంట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య తెలిపారు. ఆదివారం స్థానిక మంచినీళ్ళ గుంట పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద అంగన్వాడీలు 27వ రోజు సమ్మె కొనసాగించారు. ఈసందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.


పిచ్చాటూరులో..


పుత్తూరులో..


రేణిగుంటలో..

టెన్నిస్‌లో ఉద్దండు

- ప్రపంచ స్థాయిలో ప్రతిభ చాటుతున్న అన్నదాత బిడ్డ
- వరుస విజయాలతో టెన్నిస్‌లో రాణిస్తున్న గూడూరు క్రీడాకారిణి
- అండర్-18 విభాగంలో దేశంలో 4వ స్థానం, ప్రపంచంలో 385 ర్యాంక్
- ఉత్తమ ఆటతీరుతో ఆదర్శంగా నిలుస్తున్న క్రీడాకారిణి దండు లక్ష్మీసిరి

ప్రజాశక్తి-గూడూరుటౌన్

తాను బ్యాట్ పట్టిందంటే విజయం సాగిలపడాల్సిందే.. టోర్నీలో తాను బరిలోకి దిగుతోందంటే ప్రత్యర్థులకు వణుకుపుట్టాల్సిందే.. టెన్నిస్ పోటీల్లో 8ఏళ్లుగా వరుస విజయాలతో జోనల్ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి ర్యాంకు వరకూ తన ప్రస్థానంలో ఎక్కడా ఆగిపోలేదు. ఓ సాధారణ అన్నదాత కుటుంబంలో మెరిసిన టెన్నిస్ క్రీడాకారిణి దండు లక్ష్మీసిరి ప్రతిభ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.





కుటుంబ నేపథ్యం..

గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతానికి చెందిన దండు మహేష్‌రెడ్డి, స్రవంతి దంపతులకు లక్ష్మీ సిరి జన్మించింది. సాధారణ పరిస్థితుల నుంచే తన విద్యను కొనసాగిస్తోంది. అమ్మనాన్నల ప్రోత్సాహంతో టెన్నిస్ క్రీడలో ప్రపంచ స్థాయిలో రాణిస్తోంది.

నాన్న ప్రేరణతోనే క్రీడలోకి..

తన తండ్రికి బ్యాడ్మింటన్ అంటే చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. తన తండ్రితో పాటు చిన్ననాటి నుంచి బ్యాడ్మింటన్ ఆడటానికి వెళ్లే క్రమంలో లక్ష్మీ సిరి టెన్నిస్‌పై ఆసక్తి పెంచుకుంది. అమ్మనాన్నలు ప్రోత్సహించడంతో టెన్నిస్‌పై నైపుణ్యాన్ని క్రమంగా పెంచుకుంది. వివిధ చోట్ల నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొంటూ వరుస విజయాలు సాధించింది. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ప్రస్తుతం ప్రపంచ స్థాయి ర్యాంకును కైవసం చేసుకుంది.

దేశంలో 4వ ర్యాంక్ కైవసం..

తన ఉత్తమ క్రీడా ప్రతిభతో లక్ష్మీసిరి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. చిన్ననాటి నుంచి పెంచుకున్న నైపుణ్యంతో తన అనుభవాన్ని ఆటలో ప్రదర్శిస్తూ వరుస విజయాలు సాధిస్తోంది. 8ఏళ్ల తన ప్రస్తానంలో అండర్-18టెన్నిస్ పోటీల్లో దేశంలో 4వ ర్యాంకును, ప్రపంచంలో 385వ ర్యాంకును కైవసం చేసుకొని తన ప్రస్తానాన్ని మరింత మెరుగైన ప్రదర్శనతో ముందుకు సాగుతోంది.

కొనసాగుతున్న ప్రస్థానం..

ఇటీవల ప్రపంచ స్థాయి టోర్నమెంట్లో అద్భుతమైన ప్రదర్శన కనపరిచి ప్రస్తుతం ఫైనల్స్‌కు చేరుకుంది. ఇటీవల జరిగిన ఢిల్లీ , గౌహతి ప్రాంతాల్లో జరిగిన ప్రపంచ స్థాయి టోర్నమెంట్‌లో ఫైనల్స్‌లో ప్రతిభ కణపరిచి సత్తా చాటుకుంది. టెన్నిస్‌లో వివిధ విభాగాలైన జె-30, జె-60, జె-100, పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచి దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల పుణెలో జరిగిన టోర్నమెంట్‌లో డబుల్స్‌లో రన్నర్‌గా, సింగిల్స్‌లో విన్నర్‌గా నిలిచింది. గత సంవత్సరం బెంగుళూరులో నిర్వహించిన ప్రపంచ స్థాయి టోర్నమెంట్లో (జె-30)లో సింగిల్స్, డబుల్స్‌లో విజేతగా నిలిచింది. ఇటీవల చండీఘర్‌లో జరిగిన టోర్నమెంట్‌లో డబుల్స్‌లో రన్నర్‌గా, జె-200లో అర్హత సాధించింది.

నేడు కలకత్తాతో ఢీ..

ప్రపంచ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ పోటీల్లో సోమవారం కలకత్తాలో జె-200మ్యాచ్‌లో పాల్గొననుంది. అదేవిధంగా ఈ నెల 27న చెన్నైలో ఎస్.డి.ఏ.టి లో జరిగే 'ఖేలో ఇండియా' టోర్నమెంట్‌లో పాల్గొన్నానుంది.

'ప్రతిభకు ప్రోత్సాహకమివ్వాలి..'

నేటి పోటీ ప్రపంచంలో పేదింట నుంచి ఉత్తమ ప్రతిభతో గొప్పగా రాణిస్తున్న విద్యార్థులు, యువతకు ప్రోత్సాహకాలు అందించి ప్రోత్సహిస్తే మరింత మంది ఉన్నత స్థాయికి చేరే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. పలు కార్పొరేట్ కంపెనీలు కేటాయించే సీఎస్ఆర్ ఫండ్స్‌ను ఇటువంటి వారికి కేటాయించి చేదోడుగా నిలిస్తే దేశ ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెటతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ముక్కంటి సేవలో రాఘవేంద్రరావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి




దిగ్గజ దర్శకుడు రాఘవేంద్రరావు ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి విచ్చేశారు. ఆయనకు టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామీ అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణ మోతి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టిడిపి సీనియర్ నేత రంగినేని చెంచయ్య నాయుడు ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

16న శ్రీవారి పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పార్వేట ఉత్సవం జనవరి 16వ తేదీ ఘనంగా జరగనుంది. అదేరోజున గోదాపరిణయోత్సవం నిర్వహిస్తారు. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ మఠం నుండి ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువెళ్ళి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు శ్రీ మలయప్పస్వామివారు, శ్రీ కృష్ణస్వామివారు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పారువేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామివారు ఆలయానికి చేరుకుంటారు.

ఆర్జితసేవలు రద్దు : ఈఉత్సవాల కారణంగా జనవరి 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

జెవివి జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సైన్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ చలపతి తెలిపారు. ఆదివారం తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్ భాగస్వామ్యంతో రీజినల్ సెంటర్లో జనవిజ్ఞాన వేదిక జిల్లాస్థాయి చెకుముకి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈసంరద్భంగా మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమస్థానంలో రాణించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎస్వియు రిటైర్డ్ ప్రొఫెసర్, పరిశ్రామికవేత్త చలపతి, ఐఐఎస్ఇఆర్ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రు, ఆర్టీసీ డిపో మేనేజర్లు బాలాజీ, విశ్వనాధ, బర్డ్ డాక్టర్ గిరిజ కుమారి, ఎస్వియు ప్రొఫెసర్ శివ కుమార్, యుటిఎఫ్ నాయకులు నిర్మల, కిరణ్‌స్కూల్ అధినేత జయ రామిరెడ్డి, ఎస్ఎస్ నాయుడు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే జీవితంలో సైన్స్‌పట్ల అవగాహన పెంచుకుని, మూఢనమ్మకాలను విడిచిపెట్టాలని తెలిపారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దక్పదం కలిగి ఉంటే భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించగలరని తెలిపారు. జిల్లాస్థాయి చెకుముకి పోటీలు, సైన్స్ మేజిక్‌షో నిర్వహించారు. ఆ పోటీలలో, ప్రభుత్వ పాఠశాలలో చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, ప్రైవేటు పాఠశాలల్లో తిరుపతి సిల్వర్ ఓక్స్ పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం సాధించాయి. వీరు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారు. జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు చెంగయ్య, రఫీ, బిర్లా నాయుడు, లక్ష్మి నారాయణ, కుప్పు స్వామి, కుమార్, రమణయ్య, జయచంద్ర, రమణ, భవ్య, షరీఫ్ పాల్గొన్నారు.

13వ రోజూ మున్సిపల్ కార్మికుల సమ్మె


గూడూరులో..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గూడూరులో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె ఆదివారానికి 13వ రోజు చేరుకుంది. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మానవహారంతో నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.గోపీనాథ్ మాట్లాడుతూ అధికారులు, వైసీపీ నాయకులు, ఆర్‌డివో సిసి.అఖిల్, మున్సిపల్ కమిషనర్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, సానిటరీ సెక్రటరీలు పోలీసు సిబ్బంది మూకుమ్మడిగా శనివారం రాత్రి 11.30 సమయంలో నాలుగు జెసిబిలు 7 ట్రాక్టర్లు పెట్టి చెత్త ఎత్తించే ప్రయత్నం చేశారన్నారు. విషయం తెలుసుకున్న పారిశుధ్య కార్మికులు మూకుమ్మడిగా అక్కడికి చేరుకుని అడ్డుకోవడంతో చెత్తను అక్కడే పడేసి వెనుదిరిగారు. ఇప్పటికైనా అధికారులు కార్మికులు కడుపుకొట్టే పద్ధతి మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండగా కార్మికుల కడుపు కొట్టడం సరైన పద్ధతి కాదని రాబోయే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వానికి కార్మికులు తగిన గుణపాఠం చెప్తారని ఆయన హెచ్చరించారు. సిఐటియు పట్టణాధ్యక్షులు బివి.రమణయ్య, కార్యదర్శి ఎస్.సురేష్, బి.రమేష్, ధారా కోటేశ్వరరావు, శ్రామిక మహిళా సంఘం అధ్యక్షురాలు బి.ప్రభావతి, కార్యదర్శి ఎం.సంపూర్ణమ్మ, పెంచల ప్రసాద్, రాజేష్, బాలాజీ పాల్గొన్నారు.

వెంకటగిరి: మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు శిబిరం ఆవరణలో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య పాల్గొని మాట్లాడారు. గత 13 రోజుల నుండి మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. మున్సిపల్ కార్మికులు గొంతెమ్మ కోరికలు ఏమి కోరడం లేదని, ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంలో మీరు పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయమని అడుగుతున్నారని, ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మె మరింత ఉధృం చేస్తామని హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్.ప్రసాద్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.


వెంకటగిరిలో..

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి


సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన సమ్మె 19వరోజు తిరుపతి జిల్లాలో జయప్రదంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు తిరుపతి నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట జిల్లాలోని 34 మండలాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులను ఉద్దేశించి కందారపు మురళి ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తానని మాట ఇచ్చి నాలుగున్నరేళ్ల గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ఎన్నికల ముందు ఓ మాట, తర్వాత మరోమాట మాట్లాడుతూ ఓడ దాటాక బోడి మల్లన్న... చందంగా జగన్మోహన్ రెడ్డి తీరు సాగుతున్నదని దుయ్యబట్టారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేలు అమలు చేయాలని హెచ్ఆర్ఏ, డిఎతో కూడిన వేతనాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం సుప్రీంకోర్టు నిర్ణయించినా రాష్ట్రంలో అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి మాట తీరుకు ఎన్నికల తదనంతరం వ్యవహరిస్తున్న దానికి సంబంధం లేకుండా ఉందని విమర్శించారు. సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని నిర్ణయించాలని, 62 ఏళ్ల కాలానికి పదవీ విరమణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తాము బలపరుస్తున్నామని కందారపు మురళి ప్రకటించారు. 34 మండలాల్లో ఉద్యోగులకు సిఐటియు కార్యకర్తలు, యూనియన్లు అండగా నిలబడతాయని హామీ ఇచ్చారు. రిపబ్లికన్ పార్టీ దక్షిణాభారత అధ్యక్షులు అంజయ్య సమ్మె మద్దతుగా పాల్గొని మాట్లాడారు. గౌరవాధ్యక్షులు గండికోట నాగవెంకటేష్, జేఏసీ సెక్రెటరీ లోకేష్ బాబు, అధ్యక్షులు సూర్యకుమారి, హసీనా, జోష్ణ, రమాదేవి, జ్యోతి, సరిత, భవాని, ధనపాల్, వేణు, శివకుమార్, కాంత్, కంచి మాధవయ్య, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

రెండు నెలల్లో టిష్యూ కల్చర్ ల్యాబ్ అందుబాటులోకి..

ఔషధ మొక్కల ఉత్పత్తికి ప్రాధాన్యత



ఇంటర్వ్యూ

ప్రజాశక్తితో స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోదబాయి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ప్రకృతి సహజ సిద్ధంగా పెరగాలని, వాటిలో అంతరించిపోతున్న మొక్కలు, వృక్షజాతులను సంరక్షించడానికి బయోట్రీమ్‌లో ప్రత్యేక పరిశోధనలు చేస్తూ విరివిగా అటువంటి మొక్కలను సంరక్షించి అందిస్తున్నామని అటవీశాఖ బయోట్రీమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోధబాయి చెప్పారు. బయోట్రీమ్ ద్వారా ఎటువంటి మొక్కల రక్షణ, ఉత్పత్తులు, చాలా కాలం తరువాత బయోట్రీమ్ భవనంలో మరమ్మతులు వంటి అంశాలపై ప్రజాశక్తి యశోధబాయితో ప్రత్యేక ముఖాముఖిని నిర్వహించింది.



ప్రజాశక్తి: ఎన్ని రకాల మొక్కల జాతులకు సంబంధించి బయోట్రీమ్‌లో పునరుత్పత్తులు చేస్తున్నారు?

అధికారిణి: బయోట్రీమ్‌లో దాదాపుగా 24రకాల మొక్కల జాతులను సంరక్షిస్తూ, వాటికి కృత్రిమ వాతావరణం ఏర్పాటు చేసి రక్షిస్తున్నాం. నాణ్యమైన విత్తణాలను సేకరించి వాటి నుండి ఈ ఉత్పత్తులను తయారు చేస్తున్నాం.

ప్రజాశక్తి: పరిశ్రమల్లో ఉపయోగపడే మెటిరీయల్‌కు సంబంధించిన మొక్కలను తయారు చేస్తున్నారా?

అధికారిణి: పరిశ్రమలకు ఉపయోగపడేవి బయోట్రీమ్‌లో మలబార్ వేప ఉంది. కానీ ఇదంతా రీసైక్లింగ్ పద్ధతిలో జరిగితేనే మంచి ఫలితాలను మనం సాధించగలుగుతాం. బద్వేల్‌లో ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సెంచూరీ కంపెనీకి సంబంధించిన యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కంపెనీకి కావలసిన ముడి సరుకులు సమీప ప్రాంత రైతుల నుండి చేరితే ఇక్కడి రైతులు మంచి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు. కాని దాని కన్నా మొదటగా రైతులు మలబార్ వేపచెట్ల విశిష్టతను తెలుసుకోవాల్సివుంది. రైతులు స్వతహాగా మలబార్ వేప మొక్కలను సంరక్షస్తూనే వాటిని మార్కెటింగ్ చేసుకోవడం నేర్చుకోవాలి. ఇదే సమయంలో కంపెనీ వారు వారికి కావలసిన ముడి సరుకు ఇక్కడే దొరుకుతోందని గ్రహించి రైతులతో ఒప్పందాలు చేసుకుంటే మంచి లాభాలు రైతుకు వస్తాయి.

ప్రజాశక్తి: ఔషద మొక్కలను తయారు చేస్తున్నారా?

అధికారిణి: బయోట్రీమ్‌లో ఔషధ మొక్కలను తయారు చేస్తున్నాం. ప్రస్తుతం మోగి మొక్కలను పెంచుతున్నాం. ఇవి మధుమేహ్యా వ్యాధి నివారణకు మందులలో వినియోగిస్తారు. ఆయుర్వేద మందుల తయారీలో మోగిని వాడుతారు. దీని ద్వారా మధుమేహ్యాంతో భాదపడే వారు ఇది చెట్టుగా ఎదిగిన తరువాత పండ్లు వస్తాయి. ఇవి చూడడానికి నేరేడు పండ్లు వలే ఉంటాయి. వాటిని తింటే కూడా మధేమేహ్యం తగ్గుతుందని చాలా మంది భావిస్తారు.

ప్రజాశక్తి: టిష్యూ కల్చర్ ల్యాబ్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

అధికారిణి: శేషాచల అడవుల్లోని అరుదైన మొక్క జాతుల సంరక్షణ, పరిశోధన కోసం బయోట్రీమ్ నిర్మాణాన్ని 1984లో ప్రారంభించి 1989లో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆనాటి నుండి శేషాచల అడవుల్లోని ఎన్నో వందల మొక్కలపై పరిశోధనలు చేసి అరుదైన వాటిని సంరక్షిస్తున్నాం. ప్రస్తుతం బయోట్రీమ్‌లో పునఃనిర్మాణ పనులు చేస్తున్నాం. రెండు నెలల్లో టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను నూతన హంగులతో అందుబాటులోకి తీసుకొస్తాం.

జోరుగా కోడెద్దుల పోటీలు

- ఎద్దులను నిలువరించేందుకు యువకులు హడావుడి
- పరుష పందేల్లో పోటాపోటీగా అన్నదానం

ప్రజాశక్తి-రామచంద్రపురం: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని నూతకుంటపల్లి గ్రామంలో పరుష పందేలు వైభవంగా జరిగాయి. ఆదివారం మధ్యాహ్నం పరుష పందేల కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ మండలాల నుండి కోడెగిత్తలను, పశువుల గుంపులను తీసుకొచ్చి దొడ్డిలో బంధించారు. అనంతరం పశువుల కుమ్మలకు రంగులు పూసి, చెక్కలతో తయారు చేసిన పలకలను, నగదు, ఖరీదైన వస్త్రాలను కొమ్ములకు కట్టారు. ఈ పరుష పందేలను తిలకించేందుకు జిల్లాలోని పలు మండలాల నుంచి భారీగా తరలివచ్చారు. 12 గంటల నుండి మూడు గంటల వరకు ఈ పందేలలో పశువులు గుంపులను, కోడిగిత్తలను డప్పులు వాయిస్తూ, బాణాసంచాలో పేల్చి ఉరకలు పట్టించారు. ఈ పరుష పందేలలో పశువులను కోడిగెత్తులను నిలువరించేందుకు యువకులు ఉత్సాహం చూపించారు. కానీ పశువుల జోరుకు యువకులు బేజారు పడ్డారు. అనంతరం జల్లికట్టు ప్రేక్షకులకు టీడీపీ నాయకులు కానాల ప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు వైసీపీ నాయకులు, మరి కొంతమంది గ్రామస్తులు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.


కోడెద్దులను నిలువరించేందుకు ఎగబడుతున్న యువకులు

సేవారత్న పురస్కారాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి వారికి ఈ నెల 21న నంది, జాతీయ సేవారత్న పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు అఖిలాశ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజమ్మ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. అఖిలాశ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 4వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 21న ఆదివారం పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, అలంకరణ, ఇంద్రజాలం, క్రీడలు, నటన, కవిత్వం, వైద్యం, వాస్తు, జాతకాలు, సామాజిక సేవలు, జానపద గీతాలు మొదలగు రంగాల్లోని వారికి కళలు, కళాకారులు, సంఘ సంస్కర్తలు, సినిమా, టీవీ కళాకారులు, దర్శకులు, నిర్మాతలు, రంగస్థల కళాకారులు, గాయనీ గాయకులు, సంగీత నృత్య కళాకారులు, విద్య, వైద్యం, న్యాయవాద, ఫ్యాషన్ డిజైనింగ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర రంగాలకు చెందిన వివిధ వ్యక్తులు తమ పూర్తి వివరాలతో దరఖాస్తులను ఈనెల 12వ తేదీలోగా మొబైల్ నెంబర్ 9705313061కు వాట్సాప్ చేయాలని తెలిపారు.

'ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ప్రజోపయోగకరమైన సేవలను సంస్థ నిర్వహిస్తోందని, పి.ఎస్ఆర్ ట్రస్టు తరఫున ప్రగతి సేవాసంస్థకు తమవంతుగా రూ.లక్ష నగదును ఇవ్వనున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్మన్ పొనకా దేవసేనమ్మ ప్రకటించారు. పట్టణంలోని కరణాలవీధిలో ఏర్పాటైన వైసీపీ నేత పొనకా శివకుమార్‌రెడ్డి నివాసానికి ప్రగతి సేవాసంస్థ ప్రతినిధులు చేరుకుని శివకుమార్ రెడ్డి దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివకుమార్ రెడ్డి,దేవసేనమ్మ దంపతులను సంస్థ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కాటూరి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జి.చంద్రశేఖర్, రాము, రామ్మోహన్ రావు, దయాకర్ పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎల్ఐసి ఏజెంట్ల బ్రాంచి కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసి ఏజెంట్ల బ్రాంచ్ కార్యాలయంలో ఆదివారం శ్రీకాళహస్తి డివిజన్ స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సంవత్సరం మార్చి నెల లోపల పెండింగ్లో ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఏజెంట్ల గ్రూప్ ఇన్సూరెన్సును రూ.25 లక్షలు వరకు పెంచుతూ, వయోపరిమితితో సంబంధంలేకుండా వృత్తిలో ఉన్న ప్రతి ఏజెంట్‌కి పూర్తి స్థాయిలో గ్రూపు ఇన్సూరెన్సు ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షులు కొవ్వూరు వేణుగోపాల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వి.వి.సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు గందమనేని సతీష్, కోశాధికారి యాచమనేని బాబురావు, సుండి రామచంద్రరెడ్డి, రుద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'జనసేనను బలోపేతం చేద్దాం'

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మెరుపుల మహేష్ అన్నారు. ఆదివారం పుత్తూరులో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాంకో ఆర్డినేటర్ నాగార్జున, పుత్తూరు మండల అధ్యక్షుడు జగదీశ్వర్ రాజు, ఐటీ కో–ఆర్డినేటర్ అశోక్, రూరల్ అధ్యక్షుడు వెంకట ముని, ప్రధాన కార్యదర్శులు భానుప్రకాష్, దిలీప్, చైతన్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కమిషనర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత జన్మదినం సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం కమిషనర్ నివాసంలో పలువురు మున్సిపల్ ఉన్నత అధికారులు, ఉద్యోగులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెంట్ ఇంజనీర్ మోహన్, ఈఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీఈ విజయ్‌కుమార్ రెడ్డి, సంజయ్‌కుమార్, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బాలక్రిష్ణమ్మ సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఏపీ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు నూర్పు ర్పు బాలక్రిష్ణమ్మ సేవలు అభినందనీయం అని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కిరణ్ అన్నారు. 11 వ వర్ధంతి సభ పుత్తూరు అంబేద్కర్ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అఖిల భారత టీచర్స్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు హక్కు కల్పించాలి : సీపీఎం

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని పల్లిపాడు గ్రామానికి చెందిన దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పూర్తి హక్కు కల్పించాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పల్లిపాడు గ్రామంలో దళితులు సాగుభూములపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి పొలం లేకుండా కూలి పనులతో జీవనం సాగిస్తున్న పేదలు చెట్టుపుట్ట తొలగించుకొని వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్న భూమికి పూర్తి హక్కు కల్పించాలన్నారు. గత 20 ఏళ్ల నుంచి రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరిగి అలసిపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. పేదలు సాగు చేసుకున్న భూములకు హక్కు కల్పించకపోతే ఊరుకునేదే లేదని హెచ్చరించారు. అనంతరం పల్లిపాడు గ్రామ కమిటీ జరిగింది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, నూతన కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కు పాదం

- పోలీస్ అవుట్ పోస్టుల తనిఖీల్లో ఎస్పీ పరమేశ్వరరెడ్డి



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి కల్యాణి డ్యామ్, శ్రీవారి మెట్టు ప్రాంతాల్లో గల పులిబోనుతో పాటు, అక్రమ రవాణాను అరికట్టడానికి ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్టులను ఆకస్మిక తనిఖీలు చేశారు. అక్కడ ఎర్రచందనం కట్టడికి చేపడుతున్న విధి విధాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో డీఎస్పీలు యశ్వంత్ (చంద్రగిరి), రవీంద్రారెడ్డి (సాయుధ దళం), స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే.. అక్రమ కేసులా.?

ప్రజాశక్తి-వెంకటగిరి: అవినీతి అక్రమాలపై సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి వేదిస్తారా అంటూ ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య ఖండించారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి అధికారుల తీరును తప్పుబట్టారు. కోరన వారికి సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు.

'ప్రపంచంలో భారతీయ సంస్కృతి శ్రేష్టమైనది'


భోగిమంటలు వద్ద సందడి చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-రేణిగుంట: ప్రపంచంలో భారతీయ సంస్కృతి ఎంతో శ్రేష్ఠమైనదని కేశవరెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేశవరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రేణిగుంట మండలంలోని మామండూరు సమీపంలో గల కేశవరెడ్డి విద్యాలయం నందు ముందస్తు సంక్రాంతి వేడుకలను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు గంగిరెడ్డు రైతు మొదలగు వేషధారణలు వేసి ఆకట్టుకుని భోగిమంట వేసి అందరినీ ఉత్సాహపరిచారు. కోడిపందాలు ఆట, గంగిరెడ్డులాట రేగిపల్లతో స్నానం విద్యార్థుల నృత్యాలు ముగ్గుల పోటీలు మొదలగు కార్యక్రమాలలో విద్యార్థుల ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

'దూదేకుల కులాన్ని గుర్తించాలి'

ప్రజాశక్తి-క్యాంపస్: నూర్ బాషా/దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం తిరుపతి బాలాజీ కాలనీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షులు కరమల వలి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల గడుస్తున్న ఇంతవరకు నూరుబాష్ /దూదేకుల కమ్యూనిటీలో ఒక ఎమ్మెల్యే కానీ, ఎంపీ కానీ ఎమ్మెల్సీ కానీ లేకపోవడం దురదృష్టకరమని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షలు జనాభా ఉన్న నూర్ బాషా/ దూదేకుల కులాన్ని విస్మరిస్తున్న పార్టీలకు ఓటు వేయకూడదని సమావేశంలో నిర్ణయించారు. ఎవరైతే చట్టసభల్లో ప్రవేశించే అవకాశం కల్పిస్తారో ఆ పార్టీకి సపోర్ట్ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు పీర్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పర్ల దస్తగిరి, గౌరవ సలహాదారు, డాక్టర్ బాబన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఇందాదుళ్ల, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో 'జన్ భాగీదారీ'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రారంభించనున్న నేపథ్యంలో జన్ భాగీదారి కార్యక్రమాలను జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని జిల్లాకలెక్టర్ కే వెంకట రమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో దాదాపు రూ.400కోట్లతో 20 ఎకరాలలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుతో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా ఈ నెల19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్నదని, జిల్లాలలో జన్ భాగీదారి కార్యక్రమ నిర్వహణ ఈ నెల 4 నుండి 19వ తేదీ వరకు ఘనంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పెద్దఎత్తున పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించి విజయవంతంగా పండుగ వాతావరణంలో నిర్వహించాలని అన్నారు. ఈసందర్భంగా ఈనెల నాలుగో తేదీ నుంచి 8వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రాయింగ్, డిబేట్, వకత్వ, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడు నుంచి 11వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అంబేద్కర్ చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరించాలన్నారు. 9 నుంచి 18వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఫోటో ఎగ్జిబిషన్, లఘు చిత్రాలను ప్రదర్శించాలన్నారు. సామాజిక న్యాయంపై ఫ్లెక్సీపై సంతకాల సేకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. షెడ్యూల్ మేరకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు, అంబేద్కర్ విగ్రహ ప్రాంతాల్లో శుభ్రం చేసి పూలమాలలు వేయడం, మానవహారం ఏర్పాటు, 18న మారథాన్ రన్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



ప్రజాశక్తి-తడ: మండలంలోని కారూరు పంచాయతీలోని కారూరు హరిజనవాడ ప్రాంతంలో సిమెంటు రోడ్డు పనులను సర్పంచ్, తడ మండలం జేసీఎస్ కన్వీనర్ ఆర్కే సుందర్ రెడ్డి ప్రారంభించారు. పంచాయతీలోని తనను నమ్మిన ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో మరింత వేగంగా చురుగ్గా పనులు పూర్తిచేస్తున్నారు. రోడ్డు పనులు ప్రారంభం కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు కొలవి రఘురెడ్డి, వైసీపీ మండల యువజన అధ్యక్షులు తిరుమలరెడ్డి, నాయకులు మునుస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లు పంపిణీ

ప్రజాశక్తి-రేణిగుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పెంచిన రూ.3వేల పింఛన్‌ను అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి సంధ్యారాణి, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, నాయకులు గంగారి రమేష్, ప్రభాకర్, జగన్, దయాకర్‌రెడ్డి, ఆసన్ సాహెబ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక పంచాయతీలో పెంచిన పింఛన్ రూ.3వేలును సర్పంచ్ గంగాధర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు.

'మహిళా ఉపాధ్యాయురాలితోనే విద్యా ఉద్యమం'


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-క్యాంపస్: తొలి విద్యా ఉద్యమం మహిళా ఉపాధ్యాయురాలితోనే ప్రారంభమైందని ఎస్వీయూ వైస్ ప్రిన్సిపల్ శ్యాం డేవిడ్‌రాజు అన్నారు. ఆదివారం వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రి బాయ్ పూలే జయంతి సందర్భంగా ఎస్వీయూలోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్వీయూ వైస్ ప్రిన్సిపల్ బి.శ్యామ్ డేవిడ్ రాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య అత్యుత్తమ ప్రతిభ కల ఉత్తమ ఉపాధ్యాయినలకు సత్కారం ఏర్పాటు చేయడం ముదావహం అన్నారు. కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహదేవమ్మ, డాక్టర్ శ్రీరాములు, రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ అధ్యక్షులు టి.గోపాల్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వివిద పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉత్తమ ఉపాధ్యాయులు పూలే అవార్డులు అందుకున్నారు. శనివారం రాత్రి యూటీఎఫ్ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో విశ్వం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. బిఎన్ కండ్రిగ జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన సరళ, కంచన పుత్తూరు ఎంపీపీ పాఠశాలకు సుమలత, కాంపాలెం పాఠశాలకు చెందిన సునీతలు ఈ అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట కృష్ణయ్య, మండల అధ్యక్షులు ఈశ్వరయ్య, మహిళా కార్యదర్శి జయంతి, జిల్లా కౌన్సిలర్ చలముని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల అభివృద్ధికి వైసీపీ కృషి: ఎంపీ గురుమూర్తి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: వ్యాపారుల సమస్యలు పరిష్కరించి, వారి అభివృద్ధికి వైసీపీ కృషి చేస్తుందని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. వైసీపీ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో రాయలసీమ వ్యాపారుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం తిరుపతిలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాపార సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే సీఎం జగన్మోహన్ రెడ్డి తమ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కార్పోరేషన్ ఏర్పాటు చేశారని, సీఎం దృష్టికి తీసుకెళ్ల సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు. స్థానికులున్న సమీక్షను కూడా అక్కడ ప్రజాప్రతినిదుల ద్వారా ముఖ్యమంత్రి దృష్టి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ చూపాలని కోరారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీకి తమ సంపూర్ణ మద్దతు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు, ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ద్వారకానాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పమిడి సత్యనారాయణ శెట్టి, మురళీకృష్ణ, నరసింహులు శెట్టి, రవిచంద్రశేఖర్ పాల్గొన్నారు.

కళ్యాణీ డ్యాం ఫైరింగ్ రేంజ్‌లో ఎస్పీ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ : వార్షిక ఏఆర్.మొబిలైజేషన్‌లో భాగంగా కల్యాణీ డ్యామ్ వద్ద ఆదివారం జరుగుతున్న ఫైరింగ్ ప్రాక్టీసులో పోలీస్ డిపార్టుమెంటుకు చెందిన ఏఆర్.సిబ్బంది, అధికారులకు ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి ఎస్పీ స్వయంగా పలు రకాల తుపాకులతో నీల్ పోజిషన్, స్టాండింగ్ పొజిషన్, లయింగ్ పొజిషన్‌లో అత్యాధునిక ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసి సిబ్బందిలో ఉత్సాహాన్ని మనోధైర్యాన్ని నింపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలక మన్నారు. అత్యవసర సమయాలలో ప్రజల, ప్రభు త్వ, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని తెలిపారు. ఫైరింగ్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని మంచి మెళకువలు నేర్చుకొని, ఫైరింగ్‌లో ఉన్న అనుమానాలను నివత్తి చేసుకోవాలని సూచించారు. ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యం వహిస్తుందని, కావున ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు ఫైరింగ్ ప్రాక్టీసెస్‌ను జాగ్రత్తగా చేయాలనీ సూచించారు. అనంతరం ఏఆర్ పోలీసు అధికారు లు, సిబ్బందికి ఫైరింగ్ ప్రక్రియ గురించి ఎస్పీ పలు సూచనలు అందించారు. ప్రతిఒక్క బుల్లెట్టు టార్గెట్ (లక్ష్యం) వైపే బుల్ పడే విధంగా తర్ఫీదు పొందాలని సూచించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, జిల్లా పోలీసుశాఖ ఉన్నతి కోసం ముందడుగు వేయాల న్నారు. జిల్లా రాష్ట్రంలోనే అతి పెద్ద జిల్లా, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆల యం ఇక్కడే ఉన్నందున, ఇక్కడ విఐపిలు, వివిఐ పిలకు ఒక పక్క సరైన భద్రతను కల్పిస్తూ.. మరో పక్క ప్రజారక్షణ కొరకు అహర్నిశలు పాటు పడు తున్నారనీ కొనియాడారు. జిల్లా అదనపు ఎస్పీలు కులశేఖర్, విమల కుమారి, రాజేంద్ర, డిఎస్పీలు గిరిధర, కాటమరాజు, భాస్కర్ రెడ్డి, యశ్వంత్, భవ్య కిషోర్, సురేంద్రరెడ్డి, రవికుమార్, రవీంద్రా రెడ్డి, చంద్రశేఖర్, సిఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ అధ్యాపకులకు బెస్ట్ పోస్టర్ అవార్డు

ప్రజాశక్తి-క్యాంపస్: మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ సెల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, కేఎల్ యూనివర్సిటీ, విజయవాడ నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం చెందిన అధ్యాపకులకు మూడో బహుమతి లభించింది. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ సెల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఏఐసిటిఈ కేఎల్ యూనివర్సిటీ, విజయవాడలో వారు సంయుక్తంగా నిర్వహించిన ఇన్నోవేటివ్ భారత్ ఐఐసీ రీజినల్ మీట్ 2023 లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ మెంబర్స్ డాక్టర్ జి. లత అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంబీఏ విభాగం, డాక్టర్ సువర్ణ లత, అసిస్టెంట్ ప్రొఫెసర్, బయో సైన్స్ అండ్ సిరికల్చర్ డిపార్ట్మెంట్ ఈ కాంపిటీషన్లో యూనివర్సిటీలో జరుగుతున్నటువంటి ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ ఎంట్రాప్రినార్షిప్, పోస్టర్ ప్రెసెంటేషన్లో మూడవ బహుమతి గ్రహీతగా నిలిచారు. మహిళా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డి భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజనీ, ఎస్పియంవివి ఐఐసీ కన్వీనర్ ఆచార్య జి.రజితని, డాక్టర్ జి.లతా, డాక్టర్ సువర్ణలతను అభినందించారు.

'టీడీపీతోనే అభివృద్ధి'


ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య పేర్కొన్నారు. మండలంలోని రామక్రిష్ణాపురం పంచాయతీ గొల్లపల్లి దళితవాడలో ఆదివారం 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు డి.రవికుమార్, మాజీ ఎంపీటీసీ కోట గజపతి, నాయకులు చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పుత్తూరులో పట్టణ టీడీపీ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మునిరాజాచ్చారి, మహమ్మద్ నబీ, కిష్టప్ప మొదలియార్, లీలాప్రసాద్, ప్రసాద్, జ్యోతి, శీనా, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: గ్రామ స్థాయిలో టీడీపీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ కన్వీనర్ బెల్లంకొండ మురళి పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లుట్లవారిపల్లి పంచాయతీ బద్దలవారిపల్లిలో పార్టీ సమావేశం నిర్వహించారు. 13పంచాయతీల నుంచి పార్టీ నాయకులు హాజరైయ్యారు. 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గురుమూర్తి, గుంతాటి మురళి, నాగిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, మణికంఠరెడ్డి, దేవరాజులు, అమరనాథరెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'అన్ని వర్గాలను వంచించిన చరిత్ర వైసిపిదే'

ప్రజాశక్తి-నాయుడుపేట: రాష్ట్రంలో బీసీలుతో పాటు అన్ని వర్గాలను వంచించిన ఘన చరిత్ర ఒక్క వైసీపీ పార్టీకే చెందుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎలక్షన్ ప్రచారంలో అనేక వాగ్దానాలు చేసి ఒక్క వాగ్దానం కూడా పూర్తిగా నెరవేర్చకుండా ఆ పార్టీ నాయకులతో 99శాతం నెరవేర్చానంటూ డబ్బాలు కొట్టుకుంటూ మోసపూరిత మాటలతో ఇప్పటికే కూడా ప్రజల్ని మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు అధోగతి పాలయ్యారని రాష్ట్రంలో ఎక్కడ మచ్చుక్కూడా అభివృద్ధి కనిపించడం లేదని, పైగా ఆ పార్టీ నాయకులు అవసరం లేని పథకాల పేరుతో ఏమాత్రం జంకు లేకుండా ప్రతి ఒక్క ఇంటి ముందుకెళ్లి మేము ఎంతో అభివృద్ధి చేశామంటూ చెప్పుకోవడం జనాలను నమ్మించే ప్రయత్నాలు చేయడం హాస్యాస్పదంగా కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మైలార్ రాజశేఖర్, పసల గంగాప్రసాద్, సుధీర్, బాబు తదితరులు పాల్గొన్నారు.


చిన్నగొట్టిగల్లు: కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. ఆదివారం ఆయన వివరాలను వెల్లడించారు. మండలంలోని విజయ్‌గోపాల పురం సమీపంలో కోడిపందాలు ఆడుతున్నారని సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులో తీసుకొని వారి వద్ద రెండు కోళ్ళు రూ.2500 నగదు స్వాధీనం చేస్తున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో సిబ్బంది రమేష్ శరత్ పాల్గొన్నారు.

మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలి : చింతా మోహన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీలో మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలని మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ పిలుపునిచ్చారు. 'మార్పు రావాలి–కాంగ్రెస్ రావాలి' నినాదంతో ఆదివారం చింత మోహన్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ, కర్ణాటకలో లాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రజలు కాంగ్రెస్‌పార్టీని ఆదరించాలనీ, కాంగ్రెస్‌తోనే ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలులో కాంగ్రెస పార్టీ తర్వాతే ఏ పార్టీ అయినా అని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. డీసీసీ అధ్యక్షుడు పంట శ్రీనివాస్, నగర అధ్యక్షుడు నరేంద్ర బాబు, జనార్ధన్ రెడ్డి, గోపి, రావణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన కొత్త పాలకమండలి

ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ఆదివారం కొలువు దీరింది. కొత్తగా నియమితులైన పాలక వర్గం ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ చేగు గోవర్ధన్ గుప్తాలతో పాటు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.


అబాకస్ పోటీల్లో చిన్నారి ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చెన్నైలో జరిగిన ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం పూడి గ్రామానికి చెందిన గగన సింధు అరుదైన రికార్డు సాధించింది. ఐదేళ్ల వయసులో అబాకస్ పోటీల్లో విజేతగా నిలిచి అబ్బురపరిచింది. పోటీల్లో ఛాంపియన్ ఆఫ్ ద ఛాంపియన్‌గా నిలిచిన గగన సింధును పలువురు అభినందించారు. గగన సింధు ఓ గిరిజన తెగ నుంచి అబాకస్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలవడం విశేషం.


అవార్డు సాధించిన గగన సింధు

జగన్ పేదల పక్షం.. బాబు పెద్దల పక్షం

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: సీఎం జగన్ పేదల పక్షం.. చంద్రబాబు పెద్దల పక్షంగా ఉన్నారని రానున్న ఎన్నికల్లో ప్రజలు ఏ పక్షాన నిలబడాలో నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పెన్షనుదారులనుద్దేశించి మాట్లాడారు. శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం 'వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచిన రూ.3వేల పింఛన్‌ను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. బర్రి హేమభూషణ్ రెడ్డి, కునాటి రమణయ్య యాదవ్, జడ్పిటిసి సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, బత్తి శెట్టి, వయ్యాల కృష్ణారెడ్డి, కందాటి ఈశ్వర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.